క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు



కాల్వల్లో ఆయిల్ పిచికారీ చేస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు: మున్సిపాలిటీలో దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు కమిషనర్ మల్లికార్జున తెలిపారు. స్థానిక గోల్డెన్ పార్కు వద్ద ఉన్న మడూరు మురుగుకాల్వ నుంచి వాజ్ పేయినగర్ వరకు శుక్రవారం అబిడ్ స్ప్రే, ఎంఎల్ ఆయిల్ పిచికారీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ మురికి కాలువల్లో ఆయిల్ చల్లి లార్వాలు పెరగకుండా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎం.గోవిందరెడ్డి, వి.సుబ్బరాయుడు, ఎస్.నూర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రొద్దుటూరు: వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి డోలబాల వీరాంజనేయస్వామి వలంటీర్లు లేరని చెప్పడం సరైంది కాదన్నారు. వలంటీర్లను తొలగిస్తున్నట్లు జీఓ విడుదల చేయలేదని అలాంటప్పుడు ఆ వ్యవస్థ లేదని మంత్రి ప్రకటించడం బాధ్యతా రాహిత్యమన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని నెలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వలంటీర్లతో కలిసి పోరాటానికి సిద్ధమవుతామన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్, వినయ్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం



దూడలకు నట్టల నివారణ మందు తాగిస్తున్న పశు వైద్యాధికారి

కలసపాడు: మండలంలోని రాజుపాలెంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎ.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం శుక్రవారం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి ఉప సంచాలకులు డాక్టర్ రమేష్, పోరుమామిళ్ల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.చంద్రశేఖర్ హాజరై 35 పశువులకు గర్భకోశ, చూలు పరీక్షలు నిర్వహించారు. 42 దూడలకు నట్టల నివారణ మందులు, గొర్రెలు, మేకలకు లివర్ టానిక్ అందజేశారు. శిబిరంలో పాడిరైతులకు పశువులకు సంబంధించిన మాత్రలు, ఎముకల పొడి అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, డి రైతులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ఉపకార వేతనాలు

ప్రొద్దుటూరు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు కామరాజు అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ప్రణీత్ నరేంద్ర మెరిట్ స్కాలర్ షిప్ అందిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం సమన్వయకర్త పి.గురుమూర్తి రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ నెలలో రూ.5.25 లక్షల విలువగల మెరిట్ స్కాలర్‌షిప్‌లను రెండవ, చివరి సంవత్సరం చదువుతున్న ప్రతిభా విద్యార్థులకు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి బ్రాంచిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ప్రశంసా పత్రాలను అందిస్తారని తెలిపారు.

26న బహిరంగ సభ

ప్రొద్దుటూరు: ఈ నెల 26న కడప కళా క్షేత్రం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో బహిరంగ సభ, ర్యాలీని నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మున్సిపల్, అంగన్‌వాడీ, ఆశ, వీఆర్ఏ, పంచాయతీ వర్కర్ల సమస్యలను ప్రభుత్వమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవ, శేఖర్, శ్రీను, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ పద్మిని

ప్రొద్దుటూరు క్రైం: రోజూ పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ పద్మిని తెలిపారు. శ్రీనివాసనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలిగా ఇటీవల ఆమె బాధ్యతలు తీసుకున్నారు. వాస్తు కాంప్లెక్స్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులు, చిన్న పిల్లలకు డాక్టర్ శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన, జనని సురక్ష యోజన పథకాల గురించి వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందించే అన్ని రకాల పథకాలను, వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ పద్మిని ప్రజలను కోరారు.

నీటి సంఘాల ఎన్నికల్లో విజయమే లక్ష్యం

● సమావేశంలో ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి



వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల: డిసెంబరులో జరుగుతున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. పోరుమామిళ్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పోరుమామిళ్ల, కలసపాడు, బి. కోడూరు, కాశినాయన మండలాల పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఇప్పటి నుంచే ఓ ప్రణాళిక ప్రకారం ఎవరి పరిధిలో వారు పని చేస్తే పట్టు నిలుపుకోవచ్చునన్నారు. పార్టీ మండల నాయకులు, బూత్, ఏరియా కన్వీనర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. మండలాల్లో ఏర్పాటు చేసుకునే సమావేశాలకు తాను వస్తానని ఎమ్మెల్సీ చెప్పారు. వైఎస్ కుటుంబంలో అంతా ఉన్నాం.. ఎక్కడా రాజీ పడేది లేదు. ఈ పది రోజులు విజయం సాధించేందుకే పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బి.కోడూరు మండలంలో 14, కాశినాయన మండలంలో 12 సంఘాలున్నాయని, ముఖ్య నేతలు వేర్వేరుగా బాధ్యత తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఎవరూ భయపడనక్కరలేదని, పోలీసులు శాంతి భద్రతలు పరిరక్షించడానికేనని, బెదిరించడం, ఒత్తిళ్ల తేవడం వంటి అంశాలపై పని చేయడానికి లేదన్నారు. ఈ సమావేశంలో రమణారెడ్డి సీఎం.బాషా, చెన్ను రాజశేఖర్, ముత్యాల ప్రసాద్, చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, రాళ్లపల్లె నరసింహులు, రాజీవ్‌బాషా, వెంకట్రామిరెడ్డి, జయరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, యోగానందరెడ్డి, లక్కిరెడ్డి పిచ్చిరెడ్డి, రామచంద్రారెడ్డి, పంగా గురివిరెడ్డి, హనుమంతరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, తిరుమలరెడ్డి అంకన గురివిరెడ్డి, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, సుదర్శన్, పురుషోత్తమరెడ్డి, పాల్గొన్నారు

నీటి సంఘం ఎన్నికలకు కసరత్తు..!

చాపాడు: సాగునీటి సంఘం ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఓటర్ల జాబితాను సిద్ధం చేసి.. సచివాలయాల వద్ద ఉంచనున్నారు. డిసెంబరు 8న ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో డిసెంబరు 5న ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. మండలంలోని సాగునీటి సంఘాలకు, కేసీ కెనాల్ పరిధిలోని దువ్వూరు, చాపాడు, మైదుకూరు, ఖాజీపేట మండలాలతో సంబంధం ఉన్న చాపాడు మండలంలోని నీటి సంఘాలకు ఒకే రోజున ఎన్నికలు నిర్వహించనున్నారు. దువ్వూరు కేసీ కెనాల్ పరిధిలో అన్నశాస్త్రులపల్లె, మడూరు, చియ్యపాడు, మైదుకూరు కేసీ కెనాల్ పరిధిలో మడూరు, ఉప్పరపల్లె, అనంతపురం, 70 అనంతపురం, సోమాపురం, అల్లాడుపల్లె, మిడుతూరు సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటన్నింటిలో ఒక సంఘానికి ఒక్కో చైర్మన్‌ను ఓటర్లు ఎన్నుకుంటుండగా, సాగునీటి సంఘాల చైర్మన్లంతా కలిసి మండల చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. జెడ్పీ హైస్కూల్, సచివాలయం ఎంపీడీఓ కార్యాలయాలల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయనున్నారు. ఇప్పటికే పోలింగ్ ఆఫీసర్లకు ఎన్నికపై శిక్షణ ఇచ్చారు. డిసెంబరు 8న ఒకే రోజు నామినేషన్ల స్వీకరణ, ఎన్నిక జరుగనున్నాయి.

వ్యూహాత్మకంగా వ్యవహరించాలి

బద్వేలు అర్బన్: సాగునీటి సంఘాల ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించి వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి పేర్కొన్నారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బద్వేల్, గోపవరం, అట్లూరు మండలాల ముఖ్య నేతలతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ నియోజకవర్గంలో 50 మైనర్ ఇరిగేషన్, 10 మీడియం ఇరిగేషన్ చెరువులకు సంబంధించి ఎన్నికలు జరగనున్నాయని, ఇప్పటికే ఓటరు జాబితాను అధికారులు సిద్ధ చేశారన్నారు. ప్రతి ఓటరును కలిసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు జరిగిన మేలు వివరిస్తూ పార్టీ మద్దతుదారులను గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని 60 చెరువులకు సంబంధించి ఎన్నికల ఇన్‌చార్జులను నియమించారు. కె.రమణారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, గురు మోహన్, రామ సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, పోలిరెడ్డి, సుందర్‌రామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, కేశవరెడ్డి, మాధవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీ.గోవిందరెడ్డి

మాజీ ఎమ్మెల్యేకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న మాజీ ఎమ్మెల్యే జయరాములు

బద్వేలు అర్బన్: బద్వేల్ మాజీ ఎమ్మెల్యే తిరువీధి జయరాములుకు వరల్డ్ కల్చర్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ కమిషన్ డాక్టరేట్ ప్రదానం చేసింది. హుద్ హుద్, తిత్లీ తుఫాను సమయంలో కేరళ రాష్ట్రానికి రూ.6.50 లక్షల విలువైన సామగ్రి అందించిన నేపథ్యంలో ఆయన సేవలను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు మాజీ ఎమ్మెల్యే జయరాములు శుక్రవారం తెలిపారు. ఢిల్లీలోని తీన్‌మూర్తి మార్గ్‌లో గల ప్రైమ్ మినిస్టర్ సంగ్రహాలయ్‌లో ఈ డాక్టరేట్ ప్రదానం జరిగినట్లు తెలిపారు.

24న కె. నాగులవరంలో సభ

ప్రొద్దుటూరు: ఈ నెల 24న కార్తిక మాసం సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గం పరిధిలోని కంభం నాగులవరంలో కవులతో కలిసి సభ నిర్వహిస్తున్నట్లు యోగివేమన రెడ్ల సంక్షేమ సంఘం సభ్యులు తెలిపారు. కార్తీక మాస ప్రాముఖ్యతను సమావేశంలో వివరిస్తారని తెలిపారు.

ఆర్టీసీ సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పలు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని ఆర్టీసీ యూనియన్ నాయకులు కోరారు. శుక్రవారం ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పూల నాగరాజును వారు అనంతపురంలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. పురుషోత్తం, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

పెద్దాయన చేయించిన ప్రమాణాలు ఏమయ్యాయి?

- ప్రొద్దుటూరులో అవినీతి లేని కార్యాలయం ఉందా?
- మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి లంచం తీసుకోవద్దంటూ దేవుడి పటాల ముందు చేయించిన పెద్దాయన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రమాణాలు ఏమయ్యాయని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారుమునిరెడ్డి ప్రశ్నించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో అవినీతి లేని కార్యాలయాన్ని ఎమ్మెల్యే చూపుతారా? అంటూ ప్రశ్నించారు. చలానాల కోసం రిటైర్డు అధ్యాపకుడు బాలమునిరెడ్డి వెళితే ఫేక్ చలానా ఇవ్వడంతోపాటు సర్టిఫికెట్ మంజూరు చేయడానికి రూ.5 వేలు లంచం అడిగారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సంతకాన్నే ఫోర్జరీ చేయడం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి రెట్టింపు అయిందని ఓ ఉద్యోగి లక్షల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. అవినీతికి మూల స్తంభం మీ కుమారుడైన నంద్యాల కొండారెడ్డేనని ఆరోపించారు. మీ అనుచరులైన డీలర్లే బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. ఎగ్జిబిషన్‌లో ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం 45 రోజుల వరకే నిర్వహించాల్సి ఉండగా ఇప్పటికీ 60 రోజులు అయిందని, మున్సిపాలిటీకి రూ.40 లక్షల బకాయిలు ఎగ్జిబిషన్ కాంట్రాక్టర్ చెల్లించాల్సి ఉందన్నారు. బైపాస్ రోడ్డు టెండర్లకు సంబంధించి మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి లెస్‌కు కోడ్ చేస్తే మీ కుమారుడు కొండారెడ్డి, మహేశ్వరరెడ్డి 5 శాతం ఎక్సెస్‌కు కోడ్ చేశారన్నారు. ఇది ప్రభుత్వానికి నష్టమే కదా అని ప్రశ్నించారు. తమ కుమారుడికి సంబంధం లేదనుకుంటే రోడ్డు టెండర్ రద్దు చేయించాలని సూచించారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి చెప్పే నీతులు వినడానికి మాత్రమే సరిపోతాయన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ద్వార్శల గునాథరెడ్డి, మాడెం సందీప్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై సమర శంఖారావం



మాట్లాడుతున్న భైరవప్రసాద్

పోరుమామిళ్ల: కేంద్ర, రాష్ట్ర విధానాలపై సమర శంఖారావం పూరిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ అన్నారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అదే విధానాలు అమలు చేస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా 500 జిల్లాల్లో ఈ నెల 26న ర్యాలీ, ధర్నా, రస్తారోకోలు జరుపుతారన్నారు. సంపద సృష్టించేది కార్మిక వర్గమేనని, కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు గత పదేళ్లలో రూ. 19.28 లక్షల కోట్ల రుణమాఫీ, పన్ను రాయితీ పేరుతో ప్రజల ధనాన్ని దోచిపెట్టారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వలేదన్నారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చారన్నారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, పీఈటీ

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో కడప మున్సిపల్ కార్పొరేషన్ గాంధీనగర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 17,18,19 తేదీలలో చిలుకలూరిపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో అండర్– 14 క్యాటగిరి విభాగంలో వినయ్‌కుమార్, అకాష్, యశ్వంత్, రవికుమార్ ప్రథమ, అండర్– 17 విభాగంలో యశ్వంత్, దీపు, మణికంఠ ద్వితీయస్థానం సాధించారు. ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఆశ్రిఫున్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు..

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ 10వ తరగతి విద్యార్థి రామ్ హోనేష్ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–17 బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. శుక్రవారం పెద్ద చెప్పలి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ అండర్–17 బాలుర విభాగం ఎంపికల్లో చక్కటి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ప్రిన్సిపల్ యు. శ్రీనివాసమూర్తి, హెచ్ఎం రహమతుల్లా, ప్రసాద్, కోచ్ సుమంత్ అభినందించారు.

వసంతపేటలో వజ్రాభరణాల ప్రదర్శన



వజ్రాభరణాలను తిలకిస్తున్న ప్రజలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక వసంతపేటలోని బుశెట్టి కల్యాణ మండపంలో బుశెట్టి డైమండ్ జ్యువెలరీ ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజలకు మన్నికైన వజ్రాభరణాలను అందించేందుకు పట్టణంలో మూడోసారి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. ముక్కుపుడక, ఉంగరాలు, చైన్లు, నల్లపూసల దండలు, కమ్మలు, గాజులు తదితర ఆభరణాలను ప్రదర్శించినట్లు తెలిపారు. రూ. 6 వేల నుంచి రూ.25 లక్షల విలువగల వీవీఎస్ఈఎఫ్ ఐజీఐ సర్టిఫికెట్ డైమండ్లను విక్రయిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రదర్శన ఈ నెల 24వ తేదీ వరకు ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

పాఠశాలల పని వేళల పెంపు సరికాదు



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టనున్న పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయం తక్షణం ఉపసంహరించుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) కడప జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, కొండారెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షిని తమ కార్యాలయంలో ఆపస్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల పని సమయం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొడిగించడం వల్ల ఉపాధ్యాయులే కాకుండా విద్యార్థులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

ఇప్పుడు ఉన్న పనివేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, శ్రీనివాసులు, చంద్రమోహన్, సుబ్బ నరసయ్య, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

అదానీ గ్రూప్‌తో ఒప్పందమే లేనప్పుడు విమర్శలేమిటి?

– రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

ఖాజీపేట: కేంద్ర ప్రభుత్వ సంస్థ ఏపీ ఎలక్ట్రికల్ రెగ్యులేటర్ కమిషన్ ఆమోదంతో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా తక్కువ ధరకు విద్యుత్తు కొనుగోలు చేసినప్పుడు లంచం ఇచ్చారని ఎలా అంటారంటూ ఏపీఎస్సార్టీసీ కడప జోనల్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ప్రశ్నించారు. దుంపలగట్టు గ్రామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అదానీ గ్రూప్ సంస్థతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎలాంటి ఒప్పందం చేసుకోనప్పుడు.. ఆయనపై విమర్శలు చేయడం సరికాదన్నారు. జగన్‌పై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు.

ప్రజలపై విద్యుత్తు చార్జీల భారం మోపవద్దు



సమావేశంలో మాట్లాడుతున్ననాయకులు

అట్లూరు: పన్నుల రూపంలో ప్రజలపై భారం మోపవద్దని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శివకుమార్, అన్వేష్ పేర్కొన్నారు. అట్లూరు క్రాస్ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం మండల ప్రథమ మహా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్తు ట్రూ ఆప్ చార్జీలు ప్రభుత్వమే భరించాలని పేర్కొన్నారు. విద్యుత్తు చార్జీల పేరుతో 6,400 కోట్ల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారం వేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. అదే విధంగా స్మార్ట్ మీటర్లు అమర్చే విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విభజన హామీలో భాగంగా కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందన్నారు. ఇసుక అందుబాటులో లేనందున కార్మికులు పనులు లేక రోడ్డున పడుతున్నారన్నారు. మద్యం దుకాణాలు విచ్చలవిడిగా సమయ పాలన లేకుండా తెల్లవారు జాము నుంచి అర్ధరాత్రి వరకూ అమ్ముతున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా మహిళలకు నెలకు రూ.1500 అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గంగయ్య, గోపయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంతో పౌష్టికాహారం



అధ్యాపకులకు విత్తన ప్యాకెట్లు అందజేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

మైదుకూరు: పాఠశాలల్లో పెరటి తోటలు పెంచుకుంటే పౌష్టికాహారం తీసుకోవచ్చని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త అన్నారు. వనిపెంట జ్యోతిరావు పులె బీసీ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం పెరటి తోటల పెంపకంపై అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త బాలకృష్ణ మాట్లాడుతూ పురుగుమందులు, సిలింద్రాల నాశకాలను వినియోగించకుండా సహజ ఎరువులు, కషాయాలను ఉపయోగించి తోటలు పెంచాలన్నారు. గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కాంతిశ్రీ మాట్లాడుతూ పెరటి తోటలను నమూనా ప్రకారం పెంచితే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం పోషకాహార తోటల పెంపకం కోసం అధ్యాపకులకు, విద్యార్థులకు విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నిర్మల, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బొమ్మనసుబ్బరాయుడు

బద్వేలు అర్బన్: పట్టణంలోని ఎస్సీ–2 బాలుర వసతి గృహ విద్యార్థులకు బొమ్మన ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు శుక్రవారం పంపిణీ చేశారు. బీజేపీ కడప పార్లమెంట్ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు మాట్లాడుతూ శీతాకాలం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు రాత్రి వేళ చలికి ఇబ్బందిపడకూడదనే ఉద్దేశ్యంతో దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు, సభ్యులు పాల్గొన్నారు.

చట్ట ప్రకారం పిల్లలను దత్తత తీసుకోవాలి



దత్తత తీసుకునే విధానం వివరిస్తున్న అధికారులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : సంతానం లేని తల్లిదండ్రులు చట్టప్రకారమే పిల్లలను దత్తత తీసుకోవాలని జిల్లా ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత, శిశు గృహ మేనేజర్ కుమారి తెలిపారు. నగరంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ దత్తత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని మహిళాభివృద్ధి, స్త్రీశిసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని, పిల్లలు లేని వారు స్వీకరించేందుకు ఈ కార్యక్రమం వరం లాంటిదన్నారు. సోషల్ వర్కర్ విజయకుమారి, పద్మిని, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్తును కోల్పోరాదు

బాలికలు, యువతులు అనాలోచిత, తొందరపాటు నిర్ణయాలతో భవిష్యత్తును కోల్పోరాదని పోక్సో చట్టం జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి, న్యాయవాది ఆర్ఆర్ సునీతరాజు తెలిపారు. కడప నగరంలోని గాయత్రి జూనియర్ కాలేజీలో బాల్య వివాహాల చట్టం, పోక్సో చట్టం, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098తోపాటు పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త లక్ష్మీ ప్రసన్న, వార్డు మహిళా పోలీసు ప్రసన్న లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

– జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కె.నాగరాజు



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

బి.కోడూరు: జాతీయ కీటక జనిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుంతపల్లె, బి.కోడూరు గ్రామాల్లో శుక్రవారం జరుగుతున్న ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని డాక్టర్ వినీత్‌కుమార్ రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్‌తోపాటు ఆయన పరిశీలించారు. స్థానిక ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ప్రజలు దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలన్నారు. లార్వా ఉత్పత్తి చెంది దోమలు ఏవిధంగా అభివృద్ధి చెందుతాయో తెలిపి.. నివారణ మార్గాలను వివరించారు. అనంతరం మండలంలో జరుగుతున్న ఫీవర్ లార్వా సర్వేను పరిశీలించారు. మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గన్యా, మెదడువాపు, జ్వరం తదితర వ్యాధుల నివారణకు ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల మందులు అందిస్తామని, జనం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 18 ఏళ్ల పైబడిన వారంతా క్యాన్సర్ పరీక్ష చేయించు కునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఫైలేరియా, బోద వ్యాధి సర్వే జరుగుతున్నందున రాత్రి వేళ 9 గంటల నుండి 11 గంటల వరకు రక్తన మూనాలను సేకరించి ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు మలేరియా అధికారి జి.వెంకటరెడ్డి, రమణ, టి.నరసింహారెడ్డి, నాగమణి, రామచంద్ర, జాన్‌విలియం, విజయలక్ష్మి, కుమారి, భారతి, రామతీర్థం, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కాన్పుల సంఖ్య పెంచేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు అన్నారు. తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో జరుగుతున్న కాన్పుల వివరాలు, అందుకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పుల సంఖ్య పెంచేందుకు 108 సేవలు, ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్, వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.